క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


పెద్ద దస్తగిరి (ఫైల్)

దేవనకొండ: మండల కేంద్రానికి చెందిన పెద్ద దస్తగిరి అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు ఆదివారం దేవనకొండ సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడన్నారు. పలుచోట్ల విచారించినా ఆచూకీ లభ్యం కాలేదన్నారు. దీంతో పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు. సీఐ మాట్లాడుతూ.. ఆచూకీ తెలిసిన వారు 9603457129 నంబర్‌కు సమాచారం అందించాలని చెప్పారు.

బాలికలకు ఆర్థిక సాయం


బాలికలకు నగదు, బియ్యం ప్యాకెట్లను అందజేస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులకు స్థానిక నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు ఆదివారం రూ.25 వేల నగదు, మూడు ప్యాకెట్ల బియ్యం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ బాలికలకు మంచి విద్య, నిత్యావసర సరుకులను అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు


దేవరగట్టులో పూజలందుకుంటున్న మాళమల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారాన్ని పురస్కరించుకుని పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళహారతి, అర్చనతో పాటు రుద్రాభిషేకం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

శాకాంబరిగా వాసవీమాత



మద్దికెర : స్థానిక నగరేశ్వర స్వామి దేవాలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆదివారం శాకాంబరిగా భక్తులకు దర్శమిచ్చారు. ఉదయం అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు


మద్దికెరలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

మద్దికెర : మండల కేంద్రంలో దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్ సుహాసిని ఆదివారం తెలిపారు. గ్రామంలోని డ్రైనేజీలను శుభ్రం చేయడం, మందులు స్ప్రే చేయించడం, బ్లీచింగ్ చల్లించడమే గాకుండా ఫాగింగ్ చేయిస్తున్నామని చెప్పారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని, రాత్రి పూట దోమతెర వాడాలని, కాచి వడబోసిన నీటిని తాగాలని సూచించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


షేక్ లడ్డు రాజాబీ(ఫైల్)

తుగ్గలి : మండలంలోని రామాపురం మాజీ సర్పంచ్ ఆర్.కొట్టాలకు చెందిన షేక్ లడ్డు రాజాబీ (90) వృద్ధాప్య సమస్యలు, అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈమెకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. రాజాబీ భర్త షేక్ లడ్డు కాశీం 2012లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుగా రామాపురం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మూడేళ్ల క్రితం ఆయన మృతి చెందారు. వీరి కుమారుడు కమాల్‌బాషా ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ మద్దతుదారు సర్పంచ్‌గా ఉన్నారు. రాజాబీ మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

లాభమేంటి?

- ఈఆర్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేసినా అందుబాటులోకి రాని వైనం
- అధికారులు, సిబ్బందిని నియమించని విద్యుత్ శాఖ
- అవసరమైన ఫర్నీచర్, కంప్యూటర్లు ఇవ్వని ఉన్నతాధికారులు
- ఇబ్బంది పడుతున్న విద్యుత్ వినియోగదారులు, మీటర్ రీడర్లు
- ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో 76,716 విద్యుత్ కనెక్షన్లు



ఆలూరు సబ్ ఈఆర్వో కార్యాలయం

ఆలూరు రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఆయా విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయాల్లో ప్రభుత్వం ఈఆర్‌ఓ (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీస్) కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి మండలాలలోని సబ్ స్టేషన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం ఆలూరు ఏడీఈ కార్యాలయ ఆవరణలో ఈఆర్వో కార్యాలయాన్ని 2021 డిసెంబర్‌లో ఏర్పాటు చేశారు. అప్పటి ఆదోని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్ ఆఫీస్‌ను ప్రారంభించారు. అయితే కార్యాలయంలో కంప్యూటర్, ఫర్నీచర్ కేటాయించలేదు. అలాగే కార్యాలయ నిర్వహణకు అవసరమైన జేఏఓ (జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్), ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లతో పాటు ఒక ఆఫీస్ సబార్డినేటర్ (అటెండర్)ను నియమిస్తున్నట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జేఏఓను మాత్రమే నియమించి, మిగిలిన నియామకాలను పట్టించుకోలేదు. అలాగే.. ఇక్కడ పనిచేస్తున్న జేఏఓ ఏడాదిన్నర క్రితం ప్రమోషన్ రావడంతో బదిలీపై వెళ్లారు. దీంతో సబ్ డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు, మీటర్ రీడర్లు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

ఏర్పాటు ముఖ్య ఉద్దేశం..

ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లోని 5 మండలాల పరిధిలో ప్రధానంగా కేటగిరి–1కు చెందిన కనెక్షన్లు 58,642, కేటగిరి–2 కనెక్షన్లు 3,660, కేటగిరి–3 (వ్యవసాయ బోర్లు) 14,460 తో పాటు కేటగిరి–4,5 కలిపి మొత్తం 76,716 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మీటర్లలో సమస్యల కారణంగా విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తే ఈ కార్యాలయంలో పరిష్కరించాల్సి ఉంది. 5 మండలాల పరిధిలోని సబ్ స్టేషన్‌లలో నెలవారీగా వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లులు, మీటర్ రీడింగ్ సిబ్బంది రీడింగ్ నమోదు చేసిన వివరాలనీ ఈ కార్యాలయంలో అప్‌లోడ్ చేయాలి. అయితే అధికారులు, సిబ్బంది లేని కారణంగా ఇక్కడ ఈ సేవలేవీ లభించడం లేదు. ఏదైన సమస్య వస్తే ఆదోని డివిజన్ కార్యాలయానికి వెళ్లి సమస్యలను విన్నవించాల్సి వస్తుందని.. దీంతో సమయం వృథా కావడంతో పాటు.. ఆర్థికంగా నష్టపోతున్నామని వినియోగదారులు,మీటర్ రీడర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈఆర్వో కార్యాలయం సేవలను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

త్వరలోనే అందుబాటులోకి



ఈఆర్వో కార్యాలయంలో జేఏఓ పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న జేఏఓ ప్రమోషన్‌తో బదిలీపై వెళ్లారు. జేఏఓను నియమించాల్సి ఉంది. కార్యాలయంలో ఒక ఈఆర్వో, జూనియర్ల అసిస్టెంట్‌తో పాటు ఒక అటెండర్‌రు నియమిస్తాం. ఆఫీసు నిర్వహణకు అవసరమైన కంప్యూటర్లు, ఫర్నీచర్ వంటి తదితర సదుపాయాలు కల్పించి తర్వలో సేవలను అందుబాటులో తీసుకొస్తాం.

– ఉమాపతి,ఎస్ఈ, కర్నూలు

ఉపాధి పనుల పరిశీలన

హాలహర్వి: మండలంలోని చాకిబండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను సర్పంచ్ ఓబుళపతి ఆదివారం పరిశీలించారు. పనుల గురించి టెక్నికల్ అసిస్టెంట్ రఘు, ఫీల్డ్ అసిస్టెంట్ సూరితో ఆరా తీశారు. సర్పంచ్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదన్నారు. దీంతో వలసలు వెళ్తున్నారని, వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పనులు కల్పించాలని, పనుల్లో పాల్గొనే వారికి గరిష్ట వేతనం అందించాలని కోరారు.

కొత్త చట్టాలపై అవగాహన ఉండాలి

తుగ్గలి : దేశ వ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు చట్టాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఈఏ)ల స్థానంలో కొత్తగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధీనియమం చట్టాలుగా మార్పు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందరికీ ఆమోదయోగ్యమైన చట్టాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలందరూ వీటిపై అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు.

హామీలను గాలికొదిలి.. కథలతో కాలయాపన


ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు: అధికారంలోకి వచ్చేందుకు కూటమి నాయకులు అమలు సాధ్యం కాని హామీలిచ్చారు. ఎట్టకేలకు అధికారంలోకి వచ్చినా హామీల అమలును గాలికొదిలి.. శాసన సభలో పిట్ట కథలు, సోది చెబుతున్నారని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి విమర్శించారు. ఆదివారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలను సాగు చేస్తున్న రైతన్నలకు రైతు భరోసా, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడి, కౌలు రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలంటే తనకు భయమేస్తుందని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించడాన్ని చూస్తుంటే.. పథకాలను అమలు చేయలేక చేతులెత్తేశారని అర్థమవుతోందన్నారు. నెలన్నర గడిచినప్పటికీ ఒక్క పథకంపై కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. కేవలం పింఛన్లను అందజేస్తున్నారే తప్పా మిగత పథకాలకు ఎగనామం పెడుతున్నారని వారి చర్యలు స్పష్టం చేస్తున్నాయన్నారు. కూటమి నాయకులు కేవలం పోలవరం, రాజధాని , రెడ్‌బుక్ అమలు తప్పా ప్రజలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, సమస్యలను గాలికొదిలేశారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శాసన సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడాన్ని తప్పుబట్టారు.

విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోని అధికారులు


ఇంగళదహాళ్ బీసీ హాస్టల్‌లో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హొళగుంద: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థుల సంక్షేమాన్ని జిల్లా సంక్షేమ శాఖధికారులు గాలికొదిలేసారని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్‌కుమార్ మండిపడ్డారు. ఆదివారం ఇంగళదహాళ్ బీసీ వసతి గృహంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు, విద్యార్థుల సంక్షేమాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హాస్టల్ మరమ్మతులకు రూ.68.50 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి పంపించినా నేటి వరకు పనులు మొదలు కాలేదన్నారు. హాస్టల్‌లో గదులు, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు పూర్తి శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు కాలకృత్యాలు, ఇతర పనులను ఆరుబయటే చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, ట్రంకు పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు ఇతర వస్తువులతో పాటు మౌలిక సదుపాయాలు అందడం లేదని వెంటనే వాటిని అందించాలని డిమాండ్ చేశారు. రమేష్, మల్లి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి


వర్సిటీ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లుతో కలిసి వీసీ ఆదివారం మధ్యాహ్నం భోజన సమయంలో వర్సిటీ మెస్స్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని వృథా చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో వసతులను మెరుగు పరుస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉన్నత విద్య కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నతంగా చదువుకొని వృద్ధిలోకి రావాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన బోయ శ్రీను

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని రామళ్లకోట గ్రామానికి చెందిన యువరైతు బోయ శ్రీను ఆదివారం తన పొలంలో విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బోయ శ్రీను గ్రామానికి దూరంగానున్న పొలంలో నారు పోసుకునేందుకు సిద్ధం చేసుకుని, నీటి వసతికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పరిశీలిస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెల్దుర్తి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ రాఘవేంద్ర ప్రసాద్ చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు విచారిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

చట్టం ఎవరికీ చుట్టం కాదు

- ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి
- నూతన చట్టాలపై ప్రజలకు అవగహన


మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కౌతాళం: చట్టం ఎవరికీ చుట్టం కాదని, అందరూ చట్టానికి లోబడి ఉండాలని ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి అన్నారు. నూతన క్రిమినల్ చట్టాలపై అవగహన సదస్సును ఆదివారం స్థానిక పోలీస్టేషన్‌లో కోసిగి సీఐ ప్రసాద్‌తో కలసి నిర్వహించారు. కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో డీఎస్పీ మాట్లాడుతూ.. 1860 సంవత్సరంలో రచించిన ఐపీసీ, 1872లో రచించిన ఐఈఏ, అలాగే 1973లో వచ్చిన సీఆర్‌పీసీల స్థానాల్లో మారిన పరిస్థితులకు అనుగుణంగా బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్ మరియు భారతీయ సాక్ష్యా అధినయం 2023 చట్టాలు ఈనెల 1నుంచే అమలు అవుతున్నాయని, ఈ విషయాలన్ని ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలనుగుణంగా ఫిర్యాదు చేస్తే దానికి సంబంధించిన ఎఫ్ఐఆర్ రిపోర్టు, మేసేజ్ మీ ఫోన్‌కు వస్తుందన్నారు. ప్రతి విషయాన్ని మీ మొబైల్‌లో చూసుకోవచ్చు చెప్పారు. సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, సీపీఎం నాయకుడు మల్లయ్య, ఉప్పరహాల్ ఏకాంబర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇతిహాసాలపై అవగాహన

కర్నూలు కల్చరల్: పురాతన ఇతిహాసాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీజగన్నాథ మందిరంలో ఆదివారం నగర సంకీర్తన, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ సంకీర్తన, రాజభోగ హారతి, ఆశీర్వాదం , మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రఘునందన సేవక్ ప్రభు సందేశమిస్తూ రామాయణ భారత భాగవతాల్లోని అంశాలు మన జీవితానికి ఉన్నత మార్గాన్ని చూపుతాయన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్ల సమావేశం

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన రేషన్ దుకాణాల డీలర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ బసన్నగౌడు ఆదివారం తెలిపారు. సమావేశానికి డీలర్లందరూ విధిగా హాజరు కావాలని సూచించారు. బియ్యం, కందిబేడలు తదితర నిత్యవసరాల సరుకులను వినియోగదారులకు పంపిణీ చేసే విధానాలపై తహసీల్దార్ వారికి అవగాహన కల్పిస్తారని చెప్పారు.

నూతన కమిటీ ఎన్నిక

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదివారం కనకదాసు గ్రామ నూతన కమిటీని పూజారి లింగన్న, కె.గాదిలింగప్ప, కె.బసప్ప, కె.సిద్ధప్ప, తిమ్మప్ప, వీరేష్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కె.దొడ్డబసప్ప, ఉపాధ్యక్షుడిగా జె.కార్తీక, సెక్రటరీగా కె.దివాకర్, జాయింట్ సెక్రటరీగా కె.సురేష్, సభ్యులుగా విరుపాక్షి, ఎల్.మల్రేగౌడను ఎనుకున్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

తుగ్గలి(పత్తికొండ) : కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక స్కావెంజర్స్‌పై రాజకీయ వేధింపులు అధికమయ్యాయని వాటిని వెంటనే ఆపాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య, నియోజకవర్గ కార్యదర్శి రంగన్న, సావెంజర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుంకమ్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని చదువులరామయ్య భవన్‌లో ఆదివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్స్‌గా పనిచేస్తున్న వారు నెలల తరబడి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న వారిని తొలగించి అధికార పార్టీకి అనుకూలమైన వారిని నియమించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించి, రాజకీయ వేధింపులను నిరోధించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు సిద్ధమ్మ, సాలమ్మ, జ్యోతి, మహాదేవమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


పృథ్వీ (ఫైల్)

మద్దికెర : మండల కేంద్రానికి చెందిన జమేదారు పృథ్వీరాజ్ (32) ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వారం రోజుల క్రితం గుర్రం స్వారీ చేస్తూ కింద పడి గాయపడ్డాడు. దీంతో చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

నేడు వాహనాల వేలం

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు సోమవారం వేలాలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సెబ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఉదయం వేలాలు జరుగుతాయని చెప్పారు. వేలాల్లో పాల్గొనే వారు ఆధార్, పాన్ కార్డు కాపీలు, 10 శాతం నగదును సెబ్ స్టేషన్‌లో డిపాజిట్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వేలాల్లో వాహనాలను పొందిన వారు వెంటనే నగదును చెల్లించాల్సి ఉంటుందన్నారు.


కలుగొట్లలో ఏటికి తరలుతున్న మౌలాలి కొడు పీర్లు

ముగిసిన మొహర్రం


చెన్నంపల్లిలో పీర్లను జలధికి తీసుకెళ్తున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్, చెన్నంపల్లిలో మొహర్రం ఆదివారం ముగిసింది. వేకువజామున వెండి గొడుగులు, పట్టు వస్త్రాలతో అలంకరించిన పీర్లను గ్రామాల వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం చావిడి ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండాన్ని పూడ్చి పీర్లను జలధికి తీసుకెళ్లారు. తుగ్గలి, జొన్నగిరి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): కలుగొట్ల గ్రామంలో మౌలాలి స్వామి కొడు పీర్ల పండుగ ఆదివారం ముగిసింది. శనివారం అర్ధరాత్రి నుంచి పీర్లను పురవీధుల్లో సవారీ చేయించి సరిగెత్తు నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పీర్లకు చెక్కెర చదివింపులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలదట్టీలు, చిన్నపాటి వెండి గొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సాయంత్రం పీర్లను ఏటికి సాగనంపారు.


పెనుమాడ చెరువు కింద వరినాటు వేసేందుకు మాగాణిని ట్రాక్టర్‌తో సిద్ధం చేస్తున్న దృశ్యం

వరి నాట్లు వేసేందుకు..

కృష్ణగిరి: ఖరీఫ్‌లో భాగంగా అన్నదాతలు చెరువుల కింద కోటి ఆశలతో వరిసాగుకు సిద్ధమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో హంద్రీనీవా ప్రధాన కాలువకు ఈ ఏడాది ఏప్రిల్ వరకు నీరు రావడంతో మండలంలోని కంబాలపాడు, పెనుమాడ, కుర్మగిరి, ఎల్లనాగిరెడ్డి చెరువులో నీరు పుష్కలంగా ఉంది. దీంతో జూన్ నెలలో వరినారు పోయడంతో నారు నాటుకు అనుకూలంగా మారింది. దీంతో రైతులు వరి నాట్లకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం తీవ్ర వర్షాభావంతో వేరుశనగ, కంది, ఆముదం పంటలు ఆశించినంతగా లేకపోగా వరిసాగుపై ఆశలు పెట్టుకున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

ఘనంగా సినారే జయంతి


సీనారే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్న ఇద్దరు కవుల్లో డాక్టర్ సి.నారాయణ రెడ్డి ఒకరు కావడం తెలుగు సాహిత్యానికి దక్కిన గౌరవమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సినారే 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినారే రచనలు, సాహిత్యం ప్రజల గుండెల్లో ఎప్పటికి నిలిచి ఉంటాయన్నారు. అనంతరం కొలకలూరి శ్రీ సాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'కౌసల్యా సుప్రజా రామా' సాంఘిక నాటకం ప్రేక్షకులను అలరించింది. జీఎల్ఏవీ లక్ష్మి నిర్వహణలో ప్రదర్శితమైన ఈ నాటికకు ఆకెళ్ల శివప్రసాద్ కథామూలం అందించారు. గోపరాజు విజయ్ దర్శకత్వం, స్నిగ్ధ నాటకీకరణ చేశారు. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు లక్ష్మీకాంతరావు, యాగంటీశ్వరప్ప, బాల వెంకటేశ్వర్లు, గాండ్ల లక్ష్మన్న, రచయిత గద్వాల వీరన్న, జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపు శాల అంకయ్య, సీనియర్ కళాకారులు దస్తగిరి, క్రిష్టఫర్, తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉండిపోవాల్సిందేనా!


కృష్ణగిరి సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు

కృష్ణగిరి: వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో బోర్ల కింద పంటలు సాగు చేసుకుందామనుకున్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. బోర్లు వేసుకొని విద్యుత్ కనెక్షన్ కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. ఇలా వేలాది మంది రైతులు కనెక్షన్ల కోసం నిరీక్షిస్తున్నారనే సమస్యను గ్రహించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేసి ఆదుకుంది. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో సమస్య పరిష్కారమైనా, అసరమైన వారు మరికొందరు దరఖాస్తులు చేసుకోవడంతో కొత్తగా మరిన్ని మంజూరు చేయగా.. అవి ఆయా సబ్‌స్టేషన్‌లకు చేరుకున్నాయి కూడా. అయితే ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో రైతుల పొలాల్లో అమర్చలేకపోయారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని రైతుల పొలాల్లో ఏర్పాటు చేసేందుకు అవసరమైన వైరు, సామగ్రిని అందజేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు. ఈ విషయంపై ఏఈ మద్దిలేటి మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉన్నాయి కానీ.. అందుకు సంబంధించి వైర్, మెటీరియల్ రాలేదు. వచ్చిన వెంటనే రైతుల పొలాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.